
సాక్షి
బాపట్ల
సోమవారం ; 29 ; జనవరి ; 2024



భక్తజన సందోహం

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ ఆలయం ఆదివారం భక్తజన సందోహంగా మారింది. సెలవు దినం కావడం, శుభకార్యాలు ఉండటంతో భక్తులు వేలాదిగా తరలి వచ్చారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 520.20 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

బండ్లమ్మకు ప్రత్యేక పూజలు



చందోలు(పిట్టలవానిపాలెం): మండలంలోని చందోలులో వేంచేసి ఉన్న బగళాముఖి బండ్లమ్మ వారి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు.

న్యూస్‌రీల్

బావుడా వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన భానుప్రతాప్



బాపట్ల: బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(బావుడా) వైస్ చైర్మన్‌గా ఎ.భానుప్రతాప్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా పని చేసిన భానుప్రతాప్ బావుడా కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా రామచంద్రారెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

హరినామ సంకీర్తనకు 60మంది తెనాలి మహిళలు



తెనాలిటౌన్: తిరుమలలో హరినామ సంకీర్తనను ఆలపించేందుకు తెనాలి నుంచి 60మంది మహిళలు వెళ్తున్నట్లు శ్రీ వెంకటేశ్వర అన్నామాచార్య బృందం కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు తెలిపారు. తిరుమలకు వెళ్లే మహిళలతో బోసురోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. తిరుమలలో మహిళలు ఆలపించాల్సిన ప్రదేశాలు, నిర్వహించాల్సిన పద్ధతులు, యూనీఫాం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో భజన మండలి టీమ్ లీడర్స్ కొండపి వసుంధర, వి.లక్ష్మీసునీత, కారంపూడి రమాదేవి, వెంకట శిరీష, బృందం సభ్యులు అందె బాలచంద్రమౌళి, లక్కరాజు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్ననాటి నుంచే క్రీడా సాధన చేయాలి



గుంటూరు వెస్ట్ (క్రీడలు): చిన్నప్పటి నుంచే క్రీడా సాధన చేయాలని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా తెలిపారు. ఆదివారం స్థానిక బీఆర్ స్టేడియంలో రాష్ట్ర సిలంబమ్ (కర్రసాము) అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర పోటీలను ఆమె లాంఛనంగా ప్రారంభించారు. హెనీ క్రిస్టినా మాట్లాడుతూ క్రీడా సంఘాలు విరివిగా పోటీలు నిర్వహిస్తే క్రీడాకారుల్లోని ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డీఎస్ క్రిష్టాఫర్ మాట్లాడుతూ రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 200 మంది చిన్నారులు పాల్గొన్నారన్నారు. వీరిలో ప్రతిభకనబరచిన వారిని గుర్తించి త్వరలో తిరుపతిలో జరగనున్న జాతీయ పోటీలకు పంపిస్తామన్నారు. ఆది దేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆదినారాయణ సహాయ సహకారాలందించారన్నారు. చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు, డి.అశోక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

చీరాలలో 31న జాతీయస్థాయి పోటీలు

చీరాల రూరల్: చీరాలలోని ఎస్ఆర్అండ్‌వీఎం హైస్కూలు క్రీడా మైదానంలో ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా షూటింగ్ బాల్ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ వైద్యుల విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఇస్తర్ల బాబూరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను స్థానిక ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్ చేతులు మీదుగా ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా జాతీయస్థాయిలో నిర్వహించనున్న పోటీలకు దేశంలోని 25 రాష్ట్రాల నుంచి 300 మంది (బాల, బాలికలు) క్రీడాకారులు హాజరవుతారని తెలిపారు.

రోయింగ్ రాష్ట్ర జట్టు ఎంపిక



విజయవాడస్పోర్ట్స్: రోయింగ్ 41 జాతీయ సీనియర్ మిక్సిడ్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్టును ఎంపిక చేసినట్లు ఏపీ స్కల్లింగ్, రోయింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు తరుణ్ కాకాని తెలిపారు. విజయవాడ బబ్బూరి మైదానం సమీపంలోని కృష్ణానదిలో ఎంపిక పోటీలను అమరావతి బోటింగ్ క్లబ్ ఆధ్వర్యాన నిర్వహించినట్లు పేర్కొన్నారు. మిక్సిడ్ డబుల్స్ 500 మీటర్ల విభాగంలో కోచ్ కృష్ణమూర్తి పర్యవేక్షణలో నిర్వహించిన పోటీల్లో రాణి సహస్ర, సాయిహేమంత్ అత్యంత క్రీడా నైపుణ్యం ప్రదర్శించి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి మూడో తేదీ వరకు పుణేలో జరిగే పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందన్నారు. ఎంపికైన క్రీడాకారులను ఇన్‌చార్జ్ సెక్రటరీ పవిత్ర, ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) వీసీ, ఎండీ ధ్యాన్‌చంద్, పరిపాలన అధికారి రామకృష్ణ అభినందించారు.

నగరం స్వచ్ఛం.. ర్యాంకు ఘనం

- స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో జాతీయస్థాయిలో 17వ ర్యాంకు.. గతేడాది ఇదే విభాగంలో 108వ ర్యాంకు
- ఫాస్ట్ మూవింగ్ సిటీల్లో జాతీయస్థాయిలో 2వ ర్యాంకు
- గ్రేటర్ కార్పొరేషన్లకు దీటుగా నిలుస్తున్న గుంటూరు

నెహ్రూనగర్: గుంటూరు నగరానికి జాతీయస్థాయిలో మరోసారి గుర్తింపు లభించింది. గత కొద్ది రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో గుంటూరు నగరపాలక సంస్థ జాతీయ స్థాయిలో 17వ ర్యాంక్, రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంక్ సాధించి గ్రేటర్ కార్పొరేషన్లకు దీటుగా నిలిచింది. అదేవిధంగా ఫాస్ట్ మూవింగ్ సిటీల్లో(వేగంగా అభివృద్ధి చెందుతున్న స్వచ్ఛ నగరాలు) జాతీయ స్థాయిలో 5 స్టార్ రేటింగ్‌తో 2వ ర్యాంకు కైవసం చేసుకోవడంతో గుంటూరు ఖ్యాతి జాతీయ స్థాయిలో నిలిచింది.

ప్రతి ఏడాది ర్యాంకులు కేటాయింపు..

కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో 'పారిశుద్ధ్య మెరుగుకు స్వచ్ఛత పోటీలు' 2016 నుంచి నిర్వహిస్తుంది. మున్సిపాలిటీల్లో సాధించిన ప్రగతి ఆధారంగా ఈ ర్యాంకులు కేటాయిస్తుంది. మొత్తం 8 విభాగాలకు 9,500 మార్కులు కేటాయించారు. ఇందులో సర్వీస్ లెవల్ ప్రోగ్రెస్‌కు 4,525, సర్టిఫికేషన్‌కు 2,500, సిటిజన్ ఫీడ్ బ్యాక్‌కు 2,475 మార్కులుగా విభజించి దీని ఆధారంగా ర్యాంకులు కేటాయిస్తారు.

జాతీయ స్థాయిలో ఇనుమడించిన గుంటూరు ఖ్యాతి



గుంటూరు ఏరియల్ వ్యూ

మెరుగైన ర్యాంకు సాధనకు కారణాలివే...

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 57 డివిజన్లు ఉన్నాయి. 2150 మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరి చేత అధికారులు ప్రణాళికబద్ధంగా పారిశుద్ధ్య పనులు నిర్వహింపజేస్తున్నారు. ఇంటింటి చెత్త సేకరణ చేపట్టి, తడి చెత్తను విండ్రో, వర్మీ కంపోస్ట్ విధానం ద్వారా సేంద్రియ ఎరువుగా మార్చడం.. అదేవిధంగా పొడి చెత్తను రీసైక్లింగ్ చేయడం, రీ సైక్లింగ్ కాని చెత్తను జిందాల్ పవర్‌కు పంపించి అక్కడ వేస్ట్ టు ఎనర్జీ ఉత్పత్తి చేయడం.

జాతీయస్థాయిలో గుర్తింపు..

2022 సంవత్సరానికి స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల కేటాయింపులో జాతీయ స్థాయిలో 108వ ర్యాంకు రాగా ఈసారి గుంటూరు నగరంలో పారిశుద్ధ్య మెరుగుకు చేపట్టిన వివిధ కార్యక్రమాల నిర్వహణ ద్వారా ఊహించని రీతిలో గుంటూరుకు 17వ ర్యాంక్ వచ్చింది. గుంటూరు నగరంలోని 207 వార్డు సచివాలయాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహణతో పాటు ఇంటింటి నుంచి చెత్త సేకరణ, ప్రతి ఇంటికి ఆర్‌ఎఫ్ఐడీ ట్యాగ్‌ల ఏర్పాటు, సచివాలయం వారీగా క్లస్టర్ ఏర్పాటు చేసి హోం కంపోస్ట్, వ్యర్థాల తడి–పొడి విభజనపై ప్రజలకు అవగాహన, ప్రోత్సాహక కార్యక్రమాలతో గుంటూరుకు జాతీయస్థాయిలో 17వ ర్యాంక్ వచ్చింది. ఈ విధంగా రాష్ట్రంలోని గ్రేటర కార్పొరేషన్లయిన గ్రేటర్ విశాఖపట్నం, విజయవాడ నగరపాలక సంస్థలను సైతం పక్కకు నెట్టి మెరుగైన స్థానంలో గుంటూరు నిలిచింది.



కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మంత్రి ఆదిమూలపు సురేష్, మేయర్ కావటి మనోహర్‌నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరి (ఫైల్)

నగర ప్రజల సహకారంతోనే..



నగర ప్రజల సహకారం, అధికారుల కృషితోనే గుంటూరు నగరపాలక సంస్థకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. పారిశుద్ధ్య మెరుగుకు రాజీ పడని నిర్ణయాలు తీసుకోవడం ద్వారానే స్వచ్ఛ సర్వేక్షణ్ 2023కి జాతీయస్థాయిలో 17వ ర్యాంక్ రావడం గర్వంగా భావిస్తున్నాం.

–కీర్తి చేకూరి, కమిషనర్, గుంటూరు నగరపాలక సంస్థ

గ్రేటర్ నగరాలకు దీటుగా..



గ్రేటర్ విశాఖపట్నం, విజయవాడ నగరాలకు దీటుగా గుంటూరు నగరపాలక సంస్థ నిలుస్తుంది. స్వచ్ఛ సర్వేక్షణ్, ఫాస్ మూవింగ్ సిటీస్ జాబితాలో గుంటూరుకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం ఆనందంగా ఉంది. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో గుంటూరుకు జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభిస్తుందని ఆశిస్తున్నాం.

– కావటి మనోహర్‌నాయుడు, నగర మేయర్

నగరంలో పారిశుద్ధ్యం మెరుగుపడింది



గుంటూరు నగరంలో పారిశుద్ధ్యం మెరుగుపడింది. గతంలో రోడ్లపై చెత్త కుప్పలు కుప్పలుగా కనిపించేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇంటింటి చెత్త సేకరణ ప్రతిరోజూ చేస్తున్నారు. డ్రైన్లు సకాలంలో శుభ్రం చేస్తున్నారు. నగరంలో పార్కుల అభివృద్ధి బాగుంది.

– భరత్ సాయి, పాతగుంటూరు

నేడు ఉచిత భోజన పథకం ప్రారంభం

- మిర్చియార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డు ఆవరణలో సోమవారం ఉదయం 7.30 గంటలకు రైతు ఉచిత మధ్యాహ్న భోజనం, ఉచిత ఫలహార శాలలను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు మిర్చియార్డు చైర్మన్, మార్కెటింగ్‌శాఖ రీజినల్ సంయుక్త సంచాలకులు నిమ్మకాయల రాజనారాయణ, కాకుమాను శ్రీనివాసరావులు ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. చిల్లీస్ సిటీ ఆఫ్ ఇండియా లోగోను మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. రైతు వైద్యశాలను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ప్రారంభిస్తారన్నారు. యార్డులో టవర్ లైట్స్‌ను ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడులు ప్రారంభిస్తారని తెలిపారు. అలాగే మినరల్ వాటర్ కేంద్రం–2ను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రారంభిస్తారన్నారు. అనంతరం రైతులతో ముఖాముఖి సమావేశం ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ, తూర్పు ఎమ్మెల్యేలు మద్దాళి గిరిధర్, షేక్ మొహమ్మద్ ముస్తఫా, జిల్లాలోని పార్లమెంట్ సభ్యులు, రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా ప్రజాపరిషత్ చైర్‌పర్సన్ వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖల అధికారులు, రైతులు, వ్యాపారులు పాల్గొంటారని వివరించారు.

నలుగురు ఎస్ఐలు బదిలీ

నగరంపాలెం : జిల్లాలో నలుగురు ఎస్ఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ కె.ఆరీఫ్ హఫీజ్ ఉత్తర్వులు జారీ చేశారు. వద్దమాను ఓపీ ఎస్ఐ పి.కోటేశ్వరరావును తెనాలి రూరల్ పీఎస్‌కు, మేడికొండూరు పీఎస్ ఎస్ఐ ఎ.మధుపవన్‌కు పట్టాభిపురం పీఎస్‌కు, వెలగపూడి ఓపీ ఎస్ఐ ఎస్.రామాంజనేయులును నగరంపాలెం పీఎస్‌కు, గుంటూరు ట్రాఫిక్ పీఎస్ ఎస్ఐ ఎస్.బి.జానీబాషాను గుంటూరు డీఎస్బీకి బదిలీ చేశారు.

తలరాతలు మారుస్తున్నారు!

- ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఎవరూ సాటిరారు
- విద్యార్థుల చేతిరాతను తీర్చిదిద్దుతున్న తీరు అభినందనీయం
- ప్రభుత్వ పాఠ్య పుస్తక విభాగం డైరెక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి
- గుంటూరులో చేతిరాత నైపుణ్యంలో విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో పోటీలు.. బహుమతుల ప్రదానం
- పెద్ద సంఖ్యలో హాజరైన విద్యార్థులు, ఉపాధ్యాయులు



విద్యార్థినికి బహుమతి అందజేసి, ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి, రమేష్, రామమోహనరావు, ఖాసిం తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడంలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు వేరెవ్వరూ సాటిరారని ప్రభుత్వ పాఠ్య పుస్తక విభాగం డైరెక్టర్ కె.రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. గుంటూరు జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో ఏర్పడిన గుంటూరు క్యాలిగ్రఫీ ఫ్యామిలీ ఆధ్వర్యంలో ఆదివారం బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య హైస్కూల్ ఆడిటోరియంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో చేతిరాత నైపుణ్యంలో పోటీలు నిర్వహించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పాల రామమోహనరావు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఒక బృందంగా ఏర్పడిన ఉపాధ్యాయులు చేతిరాత నైపుణ్యంలో విద్యార్థులతో పాటు తోటి ఉపాధ్యాయులను తీర్చిదిద్దే సంకల్పంతో నాలుగేళ్లుగా విశేష కృషి చేస్తున్నారని అన్నారు. క్యాలిగ్రఫీ శిక్షకులను సమన్వయపరచుకుని, తమ సొంత ఖర్చుతో మెటీరియల్ సమకూర్చుకుని సెలవు రోజుల్లో వేర్వేరు ప్రాంతాలకు వెళ్లి, విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు చేతిరాతను అందంగా మార్చుకోవడంపై శిక్షణ ఇస్తున్న తీరు ఉపాధ్యాయలోకానికే ఆదర్శనీయమన్నారు. చేతిరాతను అందంగా మలచుకోవడం ద్వారా చదువుపై ఏకాగ్రత పెంచుకుని, విద్యార్థులు విజ్ఞానవంతులుగా రాణిస్తున్నారని అన్నారు.

ఉద్యమంలా చేతిరాత నైపుణ్య శిక్షణ..

పాఠశాలలపై ప్రభుత్వం చేస్తున్న ఖర్చు, ఆధునిక సదుపాయాలకు తోడు వృత్తిపట్ల అంకిత భావం కలిగిన ఉపాధ్యాయులు గుంటూరు జిల్లా నుంచి చిన్నగా ప్రారంభించిన చేతిరాత నైపుణ్య శిక్షణ ప్రస్తుతం ఒక ఉద్యమంలా మారి ఇతర జిల్లాలకు వ్యాపించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు పడుతున్న శ్రమ, కష్టానికి గుర్తింపు ఖచ్చితంగా ఉంటుందని, సమాజం వీరి సేవలను గుర్తించడం మొదలైందన్నారు. ప్రభుత్వ పరంగా సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

30వేల మంది విద్యార్థులు, 3వేల మంది ఉపాధ్యాయులకు శిక్షణ..

నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో డీఈఓగా పని చేసిన పిల్లి రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు సామాజిక బాధ్యతతో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. బోధనావృత్తిపై రాజీలేని ధోరణితో ముందుకెళ్తున్న ఉపాధ్యాయులు అన్ని జిల్లాల్లోని ఉపాధ్యాయులకు ఆదర్శంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమ నిర్వాహకుల్లో ఒకరైన ఉప్పాల రామమోహనరావు మాట్లాడుతూ గత నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వ పాఠశాలల్లోని 30వేల మంది విద్యార్థులతో పాటు మూడు వేల మంది ఉపాధ్యాయులకు క్యాలిగ్రఫీ శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. చేతిరాత నైపుణ్య పోటీలకు ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి 385 మంది విద్యార్థులు, 112 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రం, జ్ఞాపిక, ప్యాడ్‌తో పాటు హాజరైన విద్యార్థులకు ప్రశంసాపత్రం, ప్యాడ్ అందజేశారు. ఉపాధ్యాయులను సత్కరించి, జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.బోసుబాబు, పొత్తూరు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం నాజర్, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎస్ఓసీ పి.శ్రీనివాసరావు, క్యాలిగ్రఫీ శిక్షకులు రామారావు, శ్రీనివాసరావు, క్యాలిగ్రఫీ ఫ్యామిలీ సభ్యులు తొరటి శ్రీనివాసరావు, మోర్ల శ్రీనివాసరావు, పరిశ శ్రీనివాసరావు, నాగలక్ష్మి, ప్రసాద్, చెన్నకేశవరావు, ఇ.అనిల్‌కుమార్, అబ్దుల్ షాజిద్, రమేష్, ప్రతాప్‌రెడ్డి, బురాన్, జి.రమేష్, రమాదేవి, బి.శ్రీనివాసరావు, పుష్పలత, శారద, కృపాల్, సురేష్, రత్నశేఖర్, అచ్చిరెడ్డి పాల్గొన్నారు.

సచివాలయాలతో చేరువగా పాలన

- ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి
- పాపాయపాలెంలో రూ. 4.30 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం



అభివృద్ధి పనుల పైలాన్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

వేటపాలెం: గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో ప్రజలకు చేరువగా అన్ని సేవలు అందుబాటులోకి వచ్చాయని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పేర్కొన్నారు. మండలంలోని పాపాయపాలెం పంచాయతీ పరిధిలో రూ. 4.30 కోట్ల నిధులతో గ్రామంలో నూతనంగా నిర్మించిన వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికి రాష్ట్ర అభివృద్ధిలో రాజీ పడటం లేదన్నారు. వైఎస్సార్ సీపీ చీరాల సమన్వయకర్త కరణం వెంకటేష్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో సచివాలయాలు, ఆర్‌బీకేలను ఏర్పాటు చేసి పాలనను ప్రజల చెంతకు తెచ్చారన్నారు. గ్రామ సచివాలయాల ఏర్పాటుతో గ్రామ స్థాయిలోనే ప్రజలకు సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో పనిచేసే ఉద్యోగులు వారి పరిధిలోని రైతులకు సేవలు సత్వరమే అందించాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో రైతులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు గ్రామాల్లో అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. గతంలో ఏ అవసరం వచ్చినా మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. రైతుభరోసా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో రూ.4.30 కోట్ల నిధులతో చేసిన వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఆర్‌బీకే ప్రాంగణంలో మొక్కలు నాటారు. మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివారావు, వైస్ చైర్మన్ జైసన్‌బాబు, పీఆర్ డీఈ శేషయ్య, పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు పులి వెంకటేశ్వర్లు, జంగిలి రామారావు, గవిని శ్రీనివాసరావు, మండల ప్రత్యేక అధికారి డెబోరా, ఎంపీడీఓ నేతాజీ, యువత అధ్యక్షుడు ఆవుల అశోక్, మాజీ సర్పంచ్ కట్టా గంగయ్య, కర్రా వెంకటేశ్వర్లు, విజయ్, పులి హరికృష్ణ, జిడుగు మస్తాన్, పిట్టు పోలయ్య, ఆవుల కొండలు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తే విజయం తథ్యం

- వైఎస్సార్ సీపీ అద్దంకి సమన్వయకర్త చిన హనిమిరెడ్డి
- ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులతో సమావేశం



మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

అద్దంకి: వైఎస్సార్ సీపీ గుర్తుపై గెలుపొందిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి పార్టీ గెలుపునకు కృషిచేయాలని పార్టీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. ఆయన పార్టీ స్థానిక కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గంలోని ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, సొసైటీ ప్రెసిడెంట్‌లు, ఇతర ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల తేదీ త్వరలో ప్రకటించనున్నారన్నారు. అందుకు అందరం సిద్ధంగా ఉండాలని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి కార్యకర్త, ప్రతి ప్రజాప్రతినిధి వైఎస్సార్ సీపీ గెలుపునకు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. తాను ఒక సామాన్య కార్యకర్తవలే పనిచేస్తానన్నారు. గ్రామగ్రామాన పర్యటించి ప్రభుత్వం వివిధ పథకాల రూపంలో చేసిన మంచిని ప్రజల వద్దకు తీసుకెళతానన్నారు. అందరూ అదేవిధంగా పనిచేయాలని సూచించారు. ప్రతిపక్షాలు ఎన్ని ఏకమైనా వైఎస్సార్ సీపీ గెలుపును ఆపలేవని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, సొసైటీ ప్రెసిడెంట్‌లు, సర్పంచ్‌లు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనకు కృషిచేయాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: ఆధునిక భారత వైతాళికుడు, ప్రప్రథమ సామాజికవేత్త జ్యోతిరావు పూలే ఆశయాల సాధనకు కృషిచేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. ఆదివారం ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజాపరిషత్ పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జ్యోతిరావు పూలే విగ్రహాన్ని హెనీ క్రిస్టినా ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో అందరూ చదవాలని, బడుగు, బలహీన వర్గాలకు చదువుతోనే అభివృద్ధి సాధ్యమని పూలే విశ్వసించారన్నారు. ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడమే మనం దేశానికి చేసే సేవ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఆదాయపు పన్నుశాఖ కమిషనర్ మేకతోటి దయాసాగర్, జెడ్పీ సీఈఓ జె.మోహన్‌రావు, పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, ఇంజినీరింగ్ అధికారులు, జెడ్పీ ఉద్యోగులు పాల్గొన్నారు.



జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఆవిష్కరించిన జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

క్లుప్తంగా

మానవత్వాన్ని చాటుకున్న ఎమ్మెల్యే సుచరిత

రోడ్డు ప్రమాద బాధితులను సొంత వాహనంలో ఆస్పత్రికి తరలింపు



క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న మేకతోటి సుచరిత

మేడికొండూరు: ప్రత్తిపాడు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త మేకతోటి సుచరిత మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ఆదివారం ఫిరంగిపురం మండలం తక్కెళ్లపాడు గ్రామంలో నూతన గ్రామ సచివాలయాన్ని ప్రారంభించేందుకు సుచరిత తన వాహనంలో బయలుదేరారు.ఆమె వెళుతున్న మార్గంలో మేడికొండూరు మండలం పేరేచర్ల కూడలి వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. గమనించిన సుచరిత తన వాహనం ఆపి ప్రమాదంలో గాయపడిన వారిని పరామర్శించి తన సొంత వాహనంలో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడి

తొండపిలో ఘటన



తొండపి (ముప్పాళ్ల): వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ శ్రేణులు రాళ్ల దాడికి పాల్పడిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలంలోని తొండపి గ్రామంలో సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సత్తెనపల్లి నుంచి భారీ ఎత్తున జనసమీకరణ చేసి గ్రామంలో టీడీపీ సానుభూతిపరులే లేనిచోట ర్యాలీ నిర్వహిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన వైఎస్సార్ సీపీ శ్రేణులపై రాళ్లతో దాడికి దిగారు. కొద్దిసేపు గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు ఇరువర్గాల వారిని తరిమి కొట్టారు. ఇరువర్గాల వారు పరస్పరం రాళ్ల దాడి చేసుకోవటంతో వైఎస్సార్ సీపీకి చెందిన పఠాన్ ఆలీఖాన్‌తో పాటు పలువురు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సత్తెనపల్లికి తరలించారు. శాంతిభద్రతల దృష్ట్యా ముందస్తు చర్యలలో భాగంగా గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు



జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీలు మోపిదేవి, నందిగం సురేష్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, జగ్జీవన్‌రామ్ మనవడు అన్షుల్ అవిజిత్ తదితరులు

రేపల్లె రూరల్: బాబూ జగ్జీవన్‌రామ్ చిరస్మరణీయుడని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు పేర్కొన్నారు. జగ్జీవన్‌రామ్ విగ్రహ సాధన కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం సమీపంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆదివారం రాత్రి ఆవిష్కరించారు. మోపిదేవి మాట్లాడుతూ దేశ ఉప ప్రధానమంత్రిగా, కార్మిక శాఖ మంత్రిగా, రక్షణశాఖ మంత్రిగా, ఆహారశాఖ, నీటి పారుదల శాఖ వంటి అనేక పదవులను అలంకరించి ఆ పదవులకే వన్నెతెచ్చిన ఘనత ఆయనకే దక్కుతోందని చెప్పారు. ఆయన సేవలను ప్రతి భారతీయుడు గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. విగ్రహాన్ని పట్టణంలో ఏర్పాటు చేసుకోడడం ఆనందంగా ఉందన్నారు. బాపట్ల ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాసటగా నిలుస్తున్నారని చెప్పారు. సమసమాజ స్థాపనకై అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అర్హుల చెంతకు చేర్చుతున్న ఘనత జగనన్నకే దక్కుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జగ్జీవన్‌రామ్ మనవడు అన్షుల్ అవిజిత్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ పాలనలో ప్రతి గడప సంతోషం

- సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి
- బొడ్డువానిపాలెంలో 'పల్లెపల్లెకు హనిమిరెడ్డి'



హనిమిరెడ్డికి ఘన స్వాగతం పలుకుతున్న ప్రజలు

మేదరమెట్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో ప్రతి గడప సంతోషంగా ఉన్నయని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి తెలిపారు. కొరిశపాడు మండలంలోని బొడ్డువానిపాలెంలో 'పల్లెపల్లెకు హనిమిరెడ్డి' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఎంతో ఆనందంగా ఉన్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో తిరిగి జగనన్ననే ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. అర్హతే ప్రామాణికంగా జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందుతున్నాయని వివరించారు. చంద్రబాబు ప్రభుత్వంలో సిఫార్సులు, లంచాలు తీసుకొని జన్మభూమి కమిటీ సభ్యులకు నచ్చిన వారికి మాత్రమే పథకం వచ్చేదని పేర్కొన్నారు. ప్రస్తుతం కులమతాలకు, పార్టీలకు, వర్గాలకు ఎలాంటి తావులేకుండా కేవలం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా ఇంటి వద్దకు చేర్చుతున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి మనమందరం సిద్ధం ఉండాలని హనిమిరెడ్డి కోరారు.

జూనియర్ కళాశాలల్లో పదోన్నతులు కల్పించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న ప్రిన్సిపాల్ పోస్టులను ఇంటిగ్రేటెడ్ సీనియార్టీ ప్రాతిపదికన జూనియర్ అధ్యాపకులకు ఉద్యోగోన్నతులు కల్పించడం ద్వారా భర్తీ చేయాలని ప్రభుత్వ జూనియర్ అధ్యాపక సంఘ (జీజేఎల్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు ఉన్నం రవి పేర్కొన్నారు. ఆదివారం సాంబశివపేటలోని జేడీ శీలం సెమినార్ హాల్లో ఏపీ ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపక సంఘ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు రవి మాట్లాడుతూ ప్రస్తుతం అమల్లో ఉన్న సర్వీస్ రూల్స్ ప్రకారం జూనియర్ అధ్యాపకులకు ప్రిన్సిపాల్స్‌గా ఉద్యోగోన్నతులు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. డీవీఈవో పోస్టులను సైతం ఇంటిగ్రేటెడ్ సీనియారిటీ ప్రకారం ప్రస్తుత సర్వీసు రూల్స్ అనుసరించి జూనియర్ అధ్యాపకులకు ఉద్యోగోన్నతులు కల్పించడం ద్వారానే భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 74 శాతం అధ్యాపక పోస్టులను ఎప్పటి మాదిరిగానే జూనియర్ అధ్యాపకుల్లో నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హతలు కలిగిన వారితో ఉద్యోగోన్నతులతో భర్తీ చేయాలని కోరారు. రాష్ట్రంలోని 26 జిల్లాలకు డీవీఈవో పోస్టులను రెగ్యులర్ ప్రిన్సిపాల్స్‌తో సీనియారిటీ ప్రాతిపదికన ఉద్యోగోన్నతులతో భర్తీ చేయాలన్నారు. రాష్ట్రంలోని నాలుగు జోన్లకు ఆర్జేడీ పోస్టులను ఉద్యోగోన్నతులతో రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. పేర్రాజు, ఆర్థిక కార్యదర్శి షేక్ గౌస్‌బాషా, మహిళా కార్యదర్శి ఏ. శోభ, గుంటూరు జిల్లా అధ్యక్షుడు బి.రవికుమార్, ఉపాధ్యక్షుడు బి.లక్ష్మణరావు, నాయకులతో పాటు రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి అధ్యాపకులు పాల్గొన్నారు.

అలరించిన త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు



వేణుగాన కచేరీ చేస్తున్న శాంతాలా సుబ్రహ్మణ్యం

తెనాలిటౌన్: పట్టణ బోసురోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆవరణలో సంగీత సద్గురు సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా త్యాగరాజస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొదటి రోజు చెన్నైకు చెందిన శాంతాలా సుబ్రహ్మణ్యం చేసిన వేణుగాన కచేరి అద్భుతంగా జరిగింది. త్యాగరాజస్వామి కీర్తనలను వేణుగానం చేసి ఆలపించారు. మృదంగం, తబలా, వయోలిన్‌పై పలువురు కళాకారులు సహకారం అందించారు. కార్యక్రమాన్ని సేవా సమితి సభ్యులు పర్యవేక్షించారు.

రాష్ట్ర స్థాయి పోలురాధా ఎడ్ల పోటీలు ప్రారంభం

ముఖ్యఅతిథిగా హాజరైన పార్టీ సమన్వయకర్త చిన హనిమిరెడ్డి



ఎడ్లబండిపై నుంచి అభివాదం చేస్తున్న చినహనిమిరెడ్డి

జే పంగులూరు: రాష్ట్ర స్థాయి పోలురాధా ఎడ్ల పోటీలు ఆదివారం పంగులూరు జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పండగ వాతావరణం కనపడేలా పోటీలు నిర్వహించటం చాలా సంతోషంగా ఉందన్నారు. పంగులూరులో ఇలాంటి పోటీలు నిర్వహిస్తున్న రావూరి శ్రీనివాస రావు మిత్రబృందాన్ని అభినందించారు. భవిష్యత్‌లో ఎన్నో కార్యక్రమాలు ఇక్కడ నిర్వహించాలని చెప్పారు. నా సహకారం ఎప్పుడు ఉంటుందని తెలిపారు. అనంతరం ఎడ్ల బండి ఎక్కి చెర్నాకోల ఊపుతూ పోటీలు చూస్తున్న వారిలో ఆనందాన్ని నింపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ బీవీ కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ స్వయంపు హనుమంతురావు, వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పల్లపు రాము, నాయకులు గోపాల్‌రెడ్డి, బీసీ సెల్ మండల కన్వీనర్ చక్రవరం భాస్కర్‌రాజు, మండల రైతు సంఘం అధ్యక్షుడు రామాంజినేయులు పాల్గొన్నారు.

పోటీల వివరాలు..

ఆదివారం రాత్రి ఫ్లడ్ లైట్ల వెలుతురులో నిర్వహించిన పోటీల్లో బాపట్ల జిల్లా పోతురాజు పాలేనికి చెందిన రావూరి వెంకటేశ్వర్లు ఎడ్ల జత 10 నిమిషాల్లో 4728 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలిచింది. ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం మడనూరుకు చెందిన బత్తుల వంశీకృష్ణ ఎద్దుల జత 4711 అడుగు లాగి రెండో స్థానం, చీరాల మండలం బోయినవారిపాలెం గ్రామానికి చెందిన గోర్ల యశ్వంత్‌కు చెందిన ఎడ్ల జత 4604 అడుగులు లాగి మూడో స్థానంలో నిలిచాయి. పోటీలలో 20 జతలు పాల్గొనగా 8 జతలకు పోటీలు నిర్వాహకులు నిర్వహించారు.

ఖేలో ఇండియాలో ప్రేమసాగర్‌కు కాంస్యం

- అత్యుత్తమ ప్రతిభ చూపిన చీరాల క్రీడాకారుడు ప్రేమసాగర్
- బ్రాంజ్ మెడల్ కైవసం
- అభినందనలు తెలుపుతున్న క్రీడాకారులు



బ్రాంజ్ మెడల్ అందుకుంటున్న ప్రేమసాగర్

చీరాలరూరల్: ఖేలో ఇండియా యూత్ గేమ్స్ (జాతీయ స్థాయి) వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో చీరాల క్రీడాకారుడు అత్యుత్తమ ప్రతిభ కనబరచాడు. తన కేటగిరిలోని ప్రత్యర్థులను దీటుగా ఎదుర్కొని తృతీయ స్థానం సాధించి రాష్ట్ర కీర్తిప్రతిష్టలను ఇనుమడింపచేయడమే కాక క్రీడాభిమానుల అభినందనలు అందుకుంటున్నాడు. వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి చెన్నైలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ జరుగుతున్నాయి. ఈ పోటీల్లో చీరాల బుర్లవారిపాలెం పంచాయతీ సాయికాలనీకి చెందిన బ్యాంకు ఉద్యోగి దేవరకొండ ప్రవీణ్‌కుమార్ కుమారుడు దేవరకొండ ప్రేమసాగర్ ఉమ్మడి ప్రకాశం జిల్లాల తరపున మన రాష్ట్రం నుంచి 81 కిలోల విభాగంలో పాల్గొన్నాడు. పోటీలలో అత్యంత ప్రతిభ చూపిన అతడు స్నాచ్‌లో 124 కేజిల బరువు, క్లీన్ అండ్ జర్క్‌లో 148 కేజిల బరువులు ఎత్తి బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నాడు. ప్రస్తుతం ప్రేమసాగర్ ఏలూరులోని వెయిట్ లిఫ్టింగ్ కోచ్, అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి టి.దీన్నాబాబు వద్ద శిక్షణ తీసుకుంటున్నాడు. తనకు సహకారమందించిన అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బడేటి వెంకట రామయ్యకు, దీన్నాబాబుకు, జిల్లా కార్యదర్శి డాక్టర్ పున్నారావుకు ప్రేమసాగర్ కృతజ్ఞతలు తెలిపాడు. ఖేలో ఇండియా పోటీలలో పాల్గొని రాష్ట్ర ప్రతిష్టతను ఇనుమడింపచేసిన ప్రేమసాగర్‌ను పలువురు క్రీడాకారులు, అసోసియేషన్ ప్రతినిధులు ప్రేమసాగర్‌కు అభినందనలు తెలియజేశారు.

జిల్లా ఏఓల సంఘం అధ్యక్షుడిగా ధనరాజ్

జిల్లా వ్యవసాయధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న సభ్యులు

అద్దంకి రూరల్: జిల్లా వ్యవసాయాధికారుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం అద్దంకిలోని మున్సిపల్ హాలులో జరిగిన కార్యక్రమంలో ఎన్నుకున్నారు. జిలా వ్యవసాయాధికారుల సంఘ అధ్యక్షుడిగా అద్దంకి ఏడీఏ కే ధనరాజ్, ఉపాధ్యక్షుడిగా సంతమాగులూరు ఏవో ఆర్ లావణ్య, సెక్రటరీగా అద్దంకి ఏవో కే వెంకటకృష్ణ, ట్రెజరర్‌గా అమృతలూరు ఏవో లోకేశ్వరీ, జాయింట్ సెక్రటరీగా ఆర్ ఏవో విజయ్ (డీఆర్‌సీ) ఎన్నుకున్నారు. జిల్లా వ్యవసాయాధికారి అబ్దుల్ సత్తార్, డీఏవో ఇన్‌చార్జి విజయనిర్మల, రాష్ట్రస్థాయి వ్యవసాయాధికారుల సంఘం నుంచి ప్రెసిడెంట్ బాలభాస్కర్, జనరల్ సెక్రటరీ ప్రవీణ్, ట్రెజరర్ మురళీకిషోర్, ప్రేమసాగర్ విచ్చేసి ఎన్నికలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాప్త సహాయ సంచాలకులు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ రిటైల్ ధరలపై ప్రజాభిప్రాయ సేకరణ

నేటి నుంచి ఫిబ్రవరి 4 వరకు నిర్వహణ



సీఆర్డీఏ సర్కిల్ ఎస్ఈ విజయ్ కుమార్

తాడికొండ: 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాల రిటైల్ ధరలపై నేటి నుంచి వచ్చేనెల 1 వరకు 4 రోజుల వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు సీఆర్డీఏ సర్కిల్ విద్యుత్ ఎస్ఈ పి విజయ్ కుమార్ తెలిపారు. ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో తుళ్ళూరు మండలం రాయపూడిలోని వైఎస్సార్ విద్యుత్ భవన్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ కార్యక్రమం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు నిర్వహించబడుతుందన్నారు. సీఆర్డీఏ సర్కిల్ పరిధిలోని తాడేపల్లి, మంగళగిరి, చిలకలూరిపేట మున్సిపాలిటీల వినియోగదారులతో పాటు తుళ్ళూరు, తాడికొండ, అమరావతి, పెదకూరపాడు, మేడికొండూరు, ఫిరంగిపురం, పత్తిపాడు, వట్టిచెరుకూరు, నాదెండ్ల, గణపవరం మండలాలకు చెందిన వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ముందుగా వినియోగదారులు తమ అభ్యంతరాలు, సమస్యలను తెలిపేందుకు ఏపీఈఆర్‌సీ వెబ్‌సైట్‌లోని ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యుత్ పరమైన సమస్యలను పరిష్కారం చేసుకోవాలని ఆయన సూచించారు.

భక్తిభావంతో జీవితాలు పునీతం



ఆశీర్వాద ప్రార్థన చేస్తున్న రెవరెండ్ శామ్యూల్ కిరణ్



మహోత్సవాలకు హాజరైన పాస్టర్‌లు

- రెవరెండ్ శామ్యూల్ కిరణ్
- నేటితో ముగియనున్న బైబిల్ మిషన్ మహోత్సవాలు

పెదకాకాని: సకల జనులకు ఆశీర్వాదాలకు వేదికగా బైబిల్ మిషన్ మహోత్సవాలు నిలుస్తాయని బైబిల్ మిషన్ అధ్యక్షులు, మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె శామ్యేల్ కిరణ్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ప్రాంగణంలో ఫాదర్ ఎం.దేవదాస్ బయలు పరిచిన బైబిల్ మిషన్ 86వ మహోత్సవాలు ఆదివారం మూడో రోజుకు చేరాయి. దేవునిలో విజయం, దేవునితో విజయం, దేవుని కోసం విజయం శబ్దాలతో మహోత్సవాల ప్రాంగణం మార్మోగింది. శారీరక మానసిక బాధలు దూరమని విశ్వసించే లక్షల మంది భక్తజనం ప్రార్థనలు మిన్నంటాయి. మూడోరోజు పరిశుద్ధ ఆరాధనకు భక్తులు ధవళ వర్ణ వస్త్రములు ధరించి హాజరు కావడంతో మహోత్సవాల ప్రాంగణం ప్రత్యేకతను సంతరించుకుంది. రెవరెండ్ జె.శామ్యూల్‌కిరణ్ మాట్లాడుతూ ప్రభు భక్తి బోధనలతో ఆత్మీయ సంతోషం లభిస్తుందన్నారు. క్రమం తప్పకుండా హాజరవుతున్న భక్తులు, ప్రజలు మహదానందమును పొందుతున్నారని చెప్పారు. ఆదివారం విశ్రాంతి దినమును దేవుని ఆరాధించటానికి మాత్రమే పాటించాలని, విశ్రాంతి దినం మనోహరమైనదని బోధించారు. లోకంలో మానవులు పొరపాట్లు చేస్తారని వాటన్నిటి నుండి రక్షించుకునేందుకు రక్షణ కర్తకు ప్రార్థించాలని తెలిపారు. బైబిల్ మిషన్ ఉపాధ్యక్షులు రెవరెండ్ పి జాన్ దేవదాసు బోధిస్తూ ప్రపంచానికి ఏసుక్రీస్తు ప్రేమను చాటడానికి బైబిలు మిషన్ ప్రాముఖ్యమైన పాత్రను పోషిస్తుందన్నారు. వాక్యమనే సంపద ద్వారా సుసంపన్నులుగా ఎదగ వచ్చన్నారు. ఎదుటివారిని క్షమించి ప్రేమించాలని హితవు పలికారు.

అనంతరం హైదరాబాద్ యశోద హాస్పిటల్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ సుంకవల్లి చిన్న బాబు రచించిన లైవ్ ఫర్ లెగసి(వారసత్వం కోసం జీవించండి) పుస్తకాన్ని ఆవిష్కరించారు. కాకాని స్వస్తిశాల సంగీత బృందం ఆలపించిన భక్తి గీతాలు ప్రజలందరినీ పరవశింప చేశాయి. బైబిల్ మిషన్ అధ్యక్షులు రెవరెండ్ శామ్యూల్ కిరణ్, వైస్ ప్రెసిడెంట్ రెవరెండ్ పి జాన్ దేవదాస్, సెక్రటరీ రెవరెండ్ కే ప్రశాంత్ కుమార్, జాయింట్ సెక్రెటరీలు రెవ. సుధాకర్, రెవ జే ఆగమన రావు,రెవ ఎం.రవి ఆశీర్వాదాలు అందజేశారు. నాలుగో రోజు సోమవారం ప్రార్థనలతో బైబిల్ మిషన్ మహోత్సవాలు ముగియనున్నాయి.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



లారీ ఢీకొనడంతో మృతి చెందిన అర్జునరావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ చంద్రశేఖర్

భట్టిప్రోలు: ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ వ్యక్తిని ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఎ.చంద్రశేఖర్ తెలిపిన వివరాలు... వరికోత మిషన్ వద్ద పని చేస్తున్న కృష్ణా జిల్లా ఏటి మొగ్గ గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ అర్జునరావు(55) బైక్‌పై చెరుకుపల్లి వెళుతున్నాడు. ఎదురుగా కర్లపాలెం నుంచి యూరియా లోడుతో వస్తున్న లారీ గొరిగపూడికి బైపాస్ వద్దకు వచ్చే సరికి ఢీకొనడంతో అర్జునరావు అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. సమాచారం మేరకు ఎస్ఐ అంబటి చంద్రశేఖర్, ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువతి..

చెరుకుపల్లి: రహదారి ప్రమాదంలో యువతి మృతి చెందగా ఇరువురికి గాయాలైన ఘటన ఆదివారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. చెరుకుపల్లి పోలీసుల వివరాలు.. నిజాంపట్నంకు చెందిన కుటుంబం ద్విచక్ర వాహనంపై వస్తుండగా చందోలు ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్ సమీపంలో వెనుక నుంచి వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ప్రమాదంలో అమీరాబీ(17) అక్కడిక్కడే మృతి చెందగా, ఆమె బంధువులైన ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108 సహాయంతో ఇరువురిని గుంటూరు వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతదేహం వద్ద రోధిస్తున్న ధనలక్ష్మి

వెల్లుర్తి: కృష్ణానది ఒడ్డున తాడుతో ఉరి వేసుకొని మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని బంగారు పెంటకు చెందిన చౌటుపల్లి దుర్గారావు(40) నిబంధనలకు విరుద్ధంగా తెలంగాణ మద్యం విక్రయిస్తుంటాడు. డిసెంబర్ 13న ఓ కేసులో పోలీసుస్టేషన్‌కు తీసుకురాగా తప్పించుకుని వెళ్లాడు. అప్పటి నుంచి అతడి కోసం గాలిస్తుండగాదుర్గారావు కోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ తెచ్చుకున్నాడు. ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు ఎస్ శ్రీహరి తెలిపారు. అయితే బంధువులు పోలీసుల వేధింపుల కారణంగా అని ఆరోపించడంలో నిజం లేదని చెప్పారు. దుర్గారావు భార్య ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఇదిలా ఉండగా పోలీసు స్టేషన్ వద్ద దుర్గారావు మృతదేహాన్ని తీసుకొచ్చి టీడీపీ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి పోలీసులపై ఆరోపణలు చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని డీఎస్పీ పల్లపురాజు పేర్కొన్నారు.

రైఫిల్ షూటింగ్‌లో కేఎల్‌యూ విద్యార్థుల ప్రతిభ



తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో విద్య నభ్యసిస్తున్న విద్యార్థులు రైఫిల్ షూటింగ్‌లో బంగారు, వెండి పతకాలను సాధించారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె. హరికిషోర్ మాట్లాడారు. ఈ నెల 19 నుంచి 30 వరకు చెన్నైలోని వెలచ్చేరి అన్నా గార్డెన్స్‌లో జరిగిన 6వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో రైఫిల్ షూటింగ్ పోటీలలో తమ విశ్వవిద్యాలయంలో బీబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న తనీష్ మురళీధర్ బంగారు పతకం సాధించాడన్నారు. సీఎస్ఐటీ రెండవ సంవత్సరం చదువుతున్న నేలపల్లి ముఖేష్ వెండి పతకాన్ని సాధించాడన్నారు. మురళీధర్, ముఖేష్‌లను యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్.హనుమంతరావు, క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్, వ్యాయామ అధ్యాపకులు అభినందించారు.